క్లుప్తంగా

వైభవంగా బోనాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సింధు తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీకాలనీలో లలిత పోచమ్మ దేవాలయంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో కార్పొరేటర్ వెన్నవరం సింధు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

మంత్రి దామోదరకు వినతి



మంత్రి దామోదరకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్లు, గ్రామాలలో సీసీ రోడ్లు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ రాంరెడ్డి కోరారు. ఆదివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. కంకర తెలిన రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంతూర్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీశ్ కుమార్, మైనార్టీ మునిపల్లి అధ్యక్షుడు ఇస్మాల్ పటేల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వెంకటయ్యకు ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు



ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు అందుకుంటున్న వెంకటయ్య

జహీరాబాద్: మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాల నడుపుతున్న మారెల్లి వెంకటయ్యకు ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు అందజేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో ట్రస్మా సహకారంతో ఎడు లీడర్స్ ఆధ్వర్యంలో యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుడైనప్పటికీ నాలుగు దశాబ్దాల కాలంగా విద్యాదానం చేస్తూ ఎందరో విద్యార్థుల ఉన్నత స్థితికి ఎదిగేందుకు కృషి చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలిచినందుకు గాను సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు అందజేశారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత అన్నారు. అవార్డు వచ్చేందుకు సహకరించిన ట్రస్మా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, దశరథరెడ్డిలకు వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



కార్పొరేటర్ కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో జరిగిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

సదాశివపేట పట్టణంలో రోడ్లకు ఇరువైపుల చిరు వ్యాపారుల కోసం ప్రభుత్వం దుకాణ సముదాయాలను నిర్మించింది. ఇక్కడ షాపులను కేటాయించినా వ్యాపారాలు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. దూరాభారమే అందుకు కారణమని తెలుస్తోంది. అలాగే అవసరాలకు తగ్గట్లుగా నిర్మాణాలు చేపట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- నిరుపయోగంగా నాన్‌వెజ్ మార్కెట్ సముదాయం, 25 షెడ్లు
- వ్యాపారులకు కేటాయించినా ముందుకు రాని పరిస్థితి
- దూరాభారమే కారణమా?
- పట్టించుకోని అధికారులు



సిద్దాపూర్ రోడ్డులో నిరుపయోగంగా మారిన నాన్‌వేజ్ దుకాణ సముదాయం



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరుపయోగంలో ఉన్న దుకాణ సముదాయం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో 25 షెడ్లు నిర్మాణమయ్యాయి. సిద్దాపూర్ రోడ్డు నాగేశ్వర్‌నగర్, రహమత్‌నగర్ కాలనీల మధ్య రూ. 30 లక్షలతో నాన్‌వెజ్ దుకాణ సముదాయాన్ని కట్టారు. చిరువ్యాపారులకు ఇందులోని షాపులను కేటాయించారు. కానీ వారు ఇక్కడకు వచ్చి వ్యాపారం చేసుకోవడానికి సుముఖతను చూపించడం లేదని సమాచారం. కస్టమర్లకు దూరాభారం కావడంతోనేనని తెలుస్తోంది. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన సముదాయం నిరుపయోగంగా మారింది. అయితే పేదరిక నిర్మూలన సంస్థ వీధి వ్యాపారుల నుంచి ఎలాంటి అద్దె వసూలు చేయడం లేదు. అయినా కానీ ప్రతి బుధవారం వారంతపు సంత జరుగుతున్నా ఇక్కడ ఎవరూ కూడా వ్యాపారం చేయడం లేదు. అధికారులు వ్యాపారస్తులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే ఇక్కడ వ్యాపారం చేయడానికి ముందుకు వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

అధికారులు ఏం చేస్తున్నట్టు?

సముదాయం, షెడ్లు నిర్మించి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకొన్నారు. అందులో చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారా? లేదా అనేది పట్టించుకోలేదు. లక్షలు బోసి నిర్మించిన నాన్‌వెజ్ దుకాణ సముదాయం, వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు నేడు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. కాగా, అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. పేద నిర్మూలన సహకారంతో దుకాణ సముదాయం నిర్మించి మెప్మా శాఖ వారికి అప్పగించినట్లు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. వారే వీధి వ్యాపారులను గుర్తించి షాపులను కేటాయించాలన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

> **వినియోగంలోకి తీసుకొస్తాం**
>
> 
>
> పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల దుకాణ సముదాయం, సిద్దాపూర్ రోడ్డు, రహమత్ నగర్, నాగేశ్వర్‌నగర్ కాలనీలో మధ్య నిర్మించినా నాన్‌వెజ్ దుకాణ సముదాయాలను పరిశీలిస్తాం. వీటిని వ్యాపారులకు కేటాయించినా వారు అక్కడ వ్యాపారం నిర్వహించడానికి ముందుకు రావడం లేదు. వీధి వ్యాపారులు, మటన్, చికెన్ వ్యాపారులతో కలిసి మేము సమావేశం నిర్వహిస్తాం. వినియోగంలోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తాం.
>
> – రవీందర్‌రెడ్డి, రైతు జహీరాబాద్

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 2014–15వ సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు సిద్ధేశ్వర్, రమేశ్‌గౌడ్, భాస్కర్, భాగ్యలక్ష్మి, శశికళ, భానుప్రకాశ్‌లను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో బీ రమేశ్, సీహెచ్ మాణిక్యం, సత్యం, ఆర్.రమేశ్, కల్యాణ్‌దాసు, జాన్సీ, సుమలత పాల్గొన్నారు.



మారేపల్లిలో 2009-10 పదవ తరగతి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లిలో 2009–2010 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం మారేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కలుసుకొని పలకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు.

నేడు ఆలయాల్లో పూజలు

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం, రామలింగేశ్వర స్వామి దేవస్థానం మంజీరా క్యాంపస్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని చెప్పారు.కాగా చైతన్‌నగర్ కాలనీలోని మహాదేవుని ఆలయం, జేపీ కాలనీలోని ఉమా మహేశ్వర దేవస్థానం, టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానంలో ఉదయం 5గంటలకు స్వామికి అభిషేకం, పూజలు ఉంటాయని అర్చకులు తెలిపారు.

అన్నిరంగాల్లో రాణిస్తున్న దివ్యాంగులు



దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ ఆసిఫ్

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పటాన్‌చెరు ఎస్‌ఐ ఆసిఫ్ అలీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో ముందస్తుగా మదర్ థెరీసా జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం చిట్కుల్ బ్యూలా చర్చి రాజ్యలక్ష్మీ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శిరీష, ఫ్లోరిడాకు చెందిన రోనిత్, రిషాంత్‌లు 20 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు.

యువజన కాంగ్రెస్ కమిటీ సభ్యుల ఎంపిక

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో యువజన కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఎంపిక ముమ్మరంగా కొనసాగుతోంది. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి యూత్ కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర, జిల్లా, మండల యువజన కాంగ్రెస్ కమిటీ సభ్యుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా అభిప్రాయాలు నమోదు చేస్తున్నారు.

విస్తృతంగా లయన్స్ సేవలు



మొక్కలు నాటుతున్న మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ రవీందర్‌గౌడ్ సభ్యులు

జోగిపేట(అందోల్): లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నగేశ్ పంపాటి జన్మదినం సందర్భంగా జోగిపేట గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పేదల అవసరాలు తీర్చేందుకే లయన్స్ క్లబ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్ ఆకుల రాంబాబు, జోన్ చైర్మన్ తోట్ల రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు అల్లే శ్రీకాంత్, కోశాధికారి గడ్డమీద సంతోశ్, మాజీ కార్యదర్శి సంతోశ్, సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ విద్యార్థి విభాగం

ఉపాధ్యక్షురాలిగా వర్షిత



వర్షితకు సంఘ కండువావేస్తున్న జీవన్ కుమార్

నారాయణఖేడ్: ధర్మసమాజ్ పార్టీ అనుబంధ ధర్మ సమాజ్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా వర్షిత నియమితులయ్యారు. ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి జీవన్‌కుమార్ ఈమేరకు నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆమెకు సంఘ కండువా కప్పారు. ఈ సందర్భంగా వర్షిత మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయసాధన కోసం డా. విశారదన్ మహారాజ్ నాయకత్వంలో విద్యార్థులు, మహిళల సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. దేశంలో మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

కుక్కల దాడితో గేదె మృతి



కుక్కలదాడిలో మృతిచెందిన పాడిగేదె

నారాయణఖేడ్: నిజాంపేట మండలంలోని బాచేపల్లి, రాంరెడ్డిపేటల్లో కుక్కలు దాడిచేసి గాయపరుస్తుండటంపై ఆయా గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాంరెడ్డిపేటలో ఐదు కుక్కలు దాడిచేయడంతో రైతు పుట్టిసాయిలు ఇంటి ఎదుట కట్టేసిన పాడిగేదె మృతి చెందింది. దీని విలువ రూ.40 వేల వరకు ఉంటుందని, గేదె మృతితో తన కుటుంబం ఉపాధిని కోల్పోయిందని బాధితుడు వాపోయారు. గ్రామంలో కుక్కలు పలువురిపై దాడిచేసి గాయపర్చాయని తెలిపారు. అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఖేడ్‌లో కేపీ రెడ్డి క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. పోటీల్లో వెంకటాపూర్‌కు చెందిన వినయ్ డెకరేషన్ బృందం విజేతగా నిలువగా రూ.22,200 బహుమతి అందించినట్లు తెలిపారు. రన్నర్‌గా రిస్కిటీం నిలువడంతో రూ.22,000 అందుకున్నారన్నారు. టోర్నీలో బెస్ట్ ఎంపైర్‌గా జ్ఞానేశ్వర్, పవన్ కప్పులు అందుకున్నారు. కార్యక్రమంలో కేవీపీరెడ్డి, ఆకాశ్ రావుపాటిల్, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట



కుంట నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు

- వారం రోజులుగా తండాకు నిలిచిన సరఫరా
- మోటారు కాలిపోవడమే కారణమన్న భగీరథ ఏఈ

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మేడికుందా తండాకు వారం నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తండా వాసులు తాగునీటికి అవస్థలు పడ్డారు. తండాలో ఉన్న పంపు నుంచి సరిగా నీరు రాక పోవడంతో అల్లాడిపోయారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. కాగా, ఆదివారం తండావాసులు నీటి కోసం పడుతున్న ఇబ్బందులు సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న అధికారులు సాయంత్రం కల్లా తండాకు నీటిని సరఫరా చేశారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా.. గొర్రెకల్ వద్ద గల పంపు హౌస్ నుంచి నీటిని సరఫరా చేసే 50 హెచ్‌పీ పంపు కాలిపోయిందన్నారు. తండాకు వారం రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోవడం వాస్తవమేనన్నారు. కాలిపోయిన మోటారు స్థానంలో వేరేది తీసుకు వచ్చి నీటిని సరఫరా చేయడంలో కొంత ఆలస్యమైందన్నారు. ఇక నుంచి నీటి ఇబ్బందులు ఉండవన్నారు. నిత్యం నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ 30న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

నారాయణఖేడ్: ఖేడ్ షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 30న శ్రావణమాసంలో నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు. వ్రతాల్లో పాల్గొనేవారికి పూజా సామాగ్రిని ఆలయం తరపునే ఇస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ కృష్ణస్వామి జయంతి ఉత్సవాలకు తరలిరండి

వట్‌పల్లి(అందోల్): ముదిరాజ్ కుల వ్యవస్థాపకుడు కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాలకు తరలి రావాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ పొలిట్‌బ్యూరో సభ్యుడు బానిస నారాయణ తెలిపారు. ఈనెల 27న వట్‌పల్లి మండలం దుద్యాల సర్వేశ్వరపురీ ఆశ్రమంలో వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ముదిరాజులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఫైనాన్స్ కార్పొరేషన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కుల ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర జిల్లా నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

◆ వెలగని హైమాస్ట్ లైట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): హైవేపై హైమాస్ట్‌లైట్లు వెలగడం లేదు. నెలలు గడుస్తున్నా.. ఎవరు పట్టించుకోక పోవడంతో అంధకారం నెలకొంది. మండల కేంద్రం కౌడిపల్లిలో 765డి జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌పై కిలోమీటర్ మేర హైమాస్ట్‌లైట్లు ఉన్నాయి. నాలుగు నెలలుగా లైట్లు వెలగడంలేదు. పక్షం రోజుల క్రితం ఒకసారి మరమ్మతులు చేసినా.. రెండురోజులు వెలిగి తర్వాత బంద్ అయ్యాయి. దీంతో రాత్రివేళలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.



జహీరాబాద్‌లో కనువిందు చేసిన ఇంద్రధనస్సు

ఇంద్రధనస్సు కనువిందు

పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఉదయం నుంచి ఎండగా ఉండి.. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. అనంతరం నింగిలో ఇంద్రధనస్సు ఏర్పడింది. కొందరు అపూరప దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు.

జహీరాబాద్ టౌన్:



టేకూర్‌లోని మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తుల పూజలు

భక్తుల సందడి

మండల పరిధిలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయం, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం, రాఘవాపూర్‌లోని పంచవటి క్షేత్రం, టేకూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శ్రావణ మాసం అందులో ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. టేకూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. న్యాల్‌కల్(జహీరాబాద్):